# ఏరా... ఏరా... ఏమైపోతివే!

ఎన్నెలొస్తే మావూరు గ్యాపకమొస్తాదంటి గదా!మావూరు గ్యాపకమొస్తే,మాఏరు గ్యాపకమొస్తాది. అహ... అట్టగాదులే,వూరు గ్యాపకమొచ్చినాక ఏరు గ్యాపకంరావడంగాదు.వూరు ఏరు ఒక్కటేసారి గ్యాపకంవస్తాయి. అన్ని వూర్ల సంగతీ నాకు తెల్దుగానీ,మావూరి సంగతికొస్తే మాత్రం,వూరు ఏరు యేరుగాదు. రెండూ ఒకిటే. అందుకే'మావూరు'అని ఎట్టా అంటావుండానో,అట్టానే 'మాఏరు'అనిగుడకా అంటావుండా. వూరు ఏరుఒకిటిగా కల్సిపోయి గ్యాపకాల నిండాకూ అలికి ఆరబోసినట్టు కనిపిస్తావుంటే, వొంటికంటితో వొక్కదాన్నే సూసేదెట్ట?

"వూరు 'మావూరు' అంటివి,సరేనబ్బా... ఏర్ను'మా ఏరు'అంటే ఎట్ట?మీవూరికాపక్క ఈపక్కవుండే వూర్ల వాళ్లేంగావాల? వాళ్లకు ఏరులేదా,నీళ్లుయియ్యవా?యిట్టనేగద యిప్పుడు పైనుండే వాడూ, కింద వుండేవాడూ నీల్లకోసం కొట్లాడుకుంటావుండేది?..." అనొచ్చు.నేనట్టాఅన్లేదబ్బోవ్! మాపెన్నేటి నీళ్లన్నీ నేనే తాగాల్ననుకోడంలేదు.వాళ్లవూర్లకాడవుండే ఏర్ను 'మా ఏరు'అని వాళ్లనూ అనుకోమను.నాకు అబ్బెంతరంలేదు.నేనుసెప్పేదల్లా ఏందంటే,పగులూరాత్రీ కల్సి రోజైనట్టు,మావూరు,ఏరుకల్సి మావూరోళ్ల బతుకయితాదని. అట్టా వున్నెప్పుడు,మావూరు,మా ఏరు అనక ఏమనాలమల్ల!

" ఉత్తప్పుడు ఎఱ్ఱి ముండాల,మూగిదానాలవుంటాదిపెన్నేరు.ఊర్నికనిపెట్టుకోని కాపాడ్తావున్నెట్టా వుంటాది, ఊర్ని నమ్ముకోని పక్కన్నే బతుకుతావున్నెట్టా వుంటాది. ఇట్టాటిది ఎప్పుడన్నా నీళ్లొచ్చినప్పుడు ఎంతమారిపోతాదని!అప్పుడు సూస్తే,రోజూరాత్రీ,పగులూ సూస్తావుండే మనేరేనాయిది...అని యిసిత్రమయితాది" అని పదారేండ్ల కిందట అంటి. ఇప్పుడు సూస్తే," ఆ ఏరేనా యిది!"అని యిసిత్రమయితాది .యిప్పుడుమూగిదానాలకాదు, రోగిదానాల వుండాది. తను ఏరునన్న సంగతి తానే మర్సిపోయినట్టుండాది. మనిసికీ, గొడ్డుకూ,సకలజీవరాసికీ దప్పితీర్సి తను గొంతు ఎండిపోయి నీటి సుక్కలుపోసే వాళ్లకోసం ఎదురుచూస్తావున్నెట్టువుండాది. ఎందుకిట్టయింది.? ఏమయింది మాతల్లికి? ఎవరిట్ట,యింతగోరం సేసింది? ఏటినట్నే వుండనిచ్చి,నీటినెత్తకపోయిన ఆ దొంగలెవురు?

మా పెన్నేటి నీళ్లన్నీ నేనే తాగాలనుకోడంలేదు..అని సెప్తి. ఎవురుతాగాలని నీళ్ల నెత్తకపోయిరోనాయట్టాటోడికియెట్ట తెలుస్తాది?వూర్లనూ,వూర్ల జనాలనూ తరతరాలుగా తను బతికిస్తావస్తే, ఇప్పుడావూర్లు,జనాలు తనను పట్టిచ్చుకోకపోతే... ఈ ఏటి బతుక్కన్నా అడివిబతుకేమేలు అనుకుంటావుందా? అందుకే సీమతుమ్మతో అడివైపోతాందా? ఎఱ్ఱిపెన్నేరుకు మనిసి సంగతి ఇంకా తెల్సినట్టులేదు. ఏటికి నీళ్లురాకుండా వుంటే, ఏటికడుపుసీల్సియేయోపైర్లుపండిచ్చుకోవచ్చు అనుకొంటాడు.మోటార్లు యేసి,నరాల్లోంచి నెత్తర పిండినట్టు,యెముకల్లోంచి గుజ్జుగుంజినట్టు యాన్నో అడుగునున్న నీట్ని బైటికి తీసి తనపంట పండిచ్చుకోవాలనుకుంటాడు. ఏరు అడివైపోతే,సెట్లూ కంపలూనరికి అమ్ముకొనిలెక్కసంపాయిచ్చొచ్చు అనుకొంటాడు.

అట్టనే అయిందిప్పుడు. ఏరులేదుగానీ,ఏట్లో యెక్కడసూసినా ఇంజన్లసప్పుడు.యెవసాయం

సందడి.పైర్లు పండిచ్చే ఆత్రం తప్ప ఏరుపాయెనే అనే తాపత్రయం[1] లేదు. ఏటికి సెర్మం వొలిసేసియెముకలు బైటపడేసినట్టు, ఇసికమాయమైగడ్డలూ,కంపసెట్లూ కనిపిస్తాండాయి.వూరు,ఏరు యేరుగాదంటిగదా! ఏరు ఏరుగా ల్యాకుండా పొయ్యేతలికి,వూరికీ,ఏటికీ సమ్మందం[2] ల్యాకుండా పోయినట్టుంది. ఒకేల సమ్మందంవుందంటే,అప్పటి సమ్మందానికీ, ఇప్పటి సమ్మందానికీ సమ్మందం ల్యాకుండా పోయింది.

అప్పుడు ఏగి[3]లేస్తే మనిసి ఏట్లోవుండాల. ఏగిలేసేదాకా యెందుకు తెల్లార్జామున్నేవుండాల.రాత్రుల్ల సీకటిపన్నాక,రోంతసేపటికల్లా మాటమునుగుతాదనే[4] యాలదాకా ఏట్లో వుండాల. ఏట్లో నుంచి వూర్లోకి, ఇండ్లల్లోకి కడవల్తో నీళ్లు మోసుకోవాల. మనుసులకు ,ఎద్దులకు,బరెగొడ్లకు నీళ్లుగావాల్నంటే... ఆడా,మగా,పిల్లాజల్లా అంతా ఎప్పుడంటే అప్పుడుమోస్తేగానీ సాలవుగదా! అట్టా ఏట్లో నుంచీవూర్లోకి నీళ్లు మోసకోవడం కస్టంగానే వుండేది. అయితే, అందరూ అట్టా బరువెత్తుకొని పరువెత్తుకుంటా, మాట్లాడుకుంటా,సెలిమల్లోంచి కడవల్లోకి దోసిల్తో నీళ్లు బుడుక్ బుడుక్ అని సల్లుకుంటా నీళ్లు తెచ్చుకుంటా వుంటే ఎంతబావుండేది! ఆడోళ్లు పైట కొంగుసుట్టసుట్టుకుని నెత్తిమీద పెట్టుకోని, ఆపైన కడవ పెట్టుకోని మోస్తే,మొగోళ్లు తువ్వాల్లు కప్పుకున్న బుజాలమీదమోసేవాళ్లు. తెల్లార్జామున, సీకటి సీకటిపన్నాక నీళ్ల కోసం వచ్చే వాళ్లను ఏరుసల్లగాల్తో పలకరిచ్చేది.అట్టావూరు,ఏరు కల్సేయి. ఒకరికస్టసుకాలొకరికి తెల్సేయి .వూరు ఏరుకలవడమేగాదు,మనుసులూ మనుసులూ గుడకా కల్సేవాళ్లు. ఏమోయ్ అంటే యేమోయ్ అనుకునేవాళ్లు,ఏమమ్మా అంటే ఏమమ్మా అనుకునేవాళ్లు.

ఇప్పుడువూర్లోకి కొలాయిలొచ్చినాయి. ఏటిదగ్గరికిపోకుండానే ఏటినీళ్లు ఇండ్లల్లోకి వచ్చిపడ్తున్నాయి. నీళ్లమోసుకోవల్సిన బాదతప్పింది.సుగ[5]మైతే సగమైనట్టు, ఏటిబాదనెవురూ, పట్టిచ్చుకోవడం లేదు.ఎండిపోతా వుండే శరీరం నుంచి బొట్లుబొట్లుగా రగతం పిండిఇస్తావున్నెట్టు ఏరెంతకాలం మన కిట్టా నీల్లు తెచ్చిస్తాది... అనుకునేవాళ్లు లేరు. అంతేగాదు, కడవల్తో నీళ్లు మోసుకునేతప్పుడు, నీళ్లువూరికే పారబొయ్యనోళ్లు యిప్పుడీదుల్లో పార్తున్నా పట్టిచ్చుకోడంలేదు. అదట్టవుండనీ, నీళ్లు వచ్చినన్నాళ్లు వస్తాయి. వాళ్ల జరుగుబాటు జరిగినన్నాళ్లు జరుగుతాది. మనిసి ఏటికాడికిపోయి, ఏరిచ్చిన నీళ్లు మోసుకుని ఇంటికి తెచ్చుకున్నప్పటికీ, ఇంట్లో కూకోని ఇంట్లోకి నీళ్లు తెప్పిచ్చుకున్నప్పటికీ తేడావుండదా? ఏటికీ మనిసికీ వున్న సమ్మందందెబ్బతిన్లేదా?అందువల్లవూరు,ఏరు ఇప్పుడు యేరయిపోయినాయి.

మబ్బునా,మోడానా ఏటికిబొయి, అన్నించీ సస్తా బతుకుతా నీల్లుమోసుకున్నప్పటికంటే, ఇప్పుడు ఇండ్లలోకే కొలాయిలగుండా నీళ్లొస్తావుంటే ఎంతో బాగుందని వూర్లో అందరూ అనుకుంటా వుంటే, నువ్విట్టా అంటావేంది,..... అనొచ్చు. అవులే,నువ్వూర్లోలేవు,నీళ్లుమోసుకోవాల్సిన బాద ఎట్టానూ వుండదు.అందుకని వూరికీ,ఏటికీ సమ్మందం పోయిందని ఏందేందో అంటావుండావు... అని గుడకా అనొచ్చు.వూర్లో వాళ్లంతా యిప్పుడు సుగపడ్తాండారు అనే కడుపుకుట్టుతోనేనడగడంలేదు. సుగంగా వుండేటియి అన్నీమంచియిగావాల్ననిలేదు.'సగమైనట్టు' అనేసామెత ఎందుకొచ్చింది సెప్పండి!

వూర్లోగుడకా అప్పటియెవసాయం పోయింది. ఏరుసెనక్కాయ,జొన్నయిత్తనాలకు వూర్లోవాళ్లంతా

1) తాపత్రయం 2) సంబంధం 3) తెల్లారి లేస్తే 4) నిద్రబోయే 5) సుఖమైతే

కాండ్లు[1] కట్టుకొనిపోయే తప్పుడు ఎంత బాగుండేది! కల్లాల్లో సెనక్కాయవాములు,సొప్ప,పొట్టువాములు కొండలాలవుండేటియి.కొర్ర,అరికె,జొన్న,ఏరుసెనక్కాయపైర్లు యేయీ యిప్పుడు?పనులు జేసుకుని బతికేవాళ్లకు పనులు ల్యాకపాయె.ఎద్దులకూ,బరెగొడ్లకూ మ్యాత లేకపాయె.అసులు ఎద్దులూ,బరెగొడ్లే ల్యాకుండా పాయె. పసులుల్యాకుండాపోతే అది వూరేనా? ఆపైర్లతోపాటు ఆపనులన్నీ ల్యాకుండాపోయె. ఏ పొద్దుతిరుగుడుపూలోయేసుకుంటా, ఇండ్లల్లో టీవీలు సూసుకుంటా కూకున్ని. జరిగేవాళ్లకు ఇది అప్పటికంటే సుగంగానే వుంటాది. అయితే,మంచిదేనా?

ఎద్దుల్తో సేద్యం సేస్తావుండే తప్పుడు,అందులో ఎంతపస్తనం[2] వుండేది! ఎద్దులబండినాగల్లో కూకొని తోలేతప్పుడు వుండే సంతోసం,కారెక్కినా,యిమానం యెక్కినా వుంటాదా?యిత్తనం గొర్రుతోలడమంటే యేందో, కత్తెరమెట్లుపాయడం అంటే యేందో యిప్పటోళ్లకు తెల్చునా?యిత్తనాలకు సెనక్కాయలువొల్చుకుంటా, కతలుసెప్పుకుంటా వుంటే ఎంతబావుండేదో,టీవీల్లో సిన్మాలు సూసేవాళ్లకు ఏం తెల్చు?కూలోళ్లతో కల్చి కలుపు తియ్యడమో,కోతలు కొయ్యడమో,సేసేతప్పుడు,బువ్వలొస్తే అందరూ కూకోనితినేతప్పుడు ఎట్లుంటాదో సెప్తే మాత్రం ఎట్లాతెలుస్తాది? యెవసాయంపనులు మనుసులు సెయ్యకుండా యంత్రాలు సేస్తావుండె.పండిచ్చేపంట మనుసులు తినేదీగాకపాయె,పసులు తినేదీగాకపాయె.మనిసికీ,పసువుకూ వుండే సమ్మందం కూడా ల్యాకుండాపాయె.కస్టపడేది తక్కువయిందిగనక,సుగంగానే వుండొచ్చు.అయితే, ఆ సుగంలో సంతోషం వుండాదా?సంతోషంలేని సుగంకన్నా, సంతోషంవుండే కస్టంమేలుగదా!

ఇదంతా ఎందుకు సెప్తి?ఏటికాడికిబొయి నీళ్లు మోసుకొని తెచ్చుకునేతప్పటికన్నా, ఏటినీళ్లు ఇండ్లల్లోకి వస్తావుంటే నుగంగావుంది... అనేదానికి సెప్తి.మావూరు, ఏరు యేరుగాదనుకుంటే,ఇప్పుడుయేరయిపోతాండాయిగదా అనేబాదకు సెప్తి.అప్పుడు ఆ ఏట్లో ఇసికపైననడుస్తావుంటే,పారకిందవుండే జలపాదాలకు తాకుతావున్నెట్టు తడితగిలేది.సేతుల్తో ఇసికనట్టా యిట్టాతోస్తే, దోసిలి నిండా నీళ్లు! సెలిమలో నిండా వుండే పాతనీళ్లను బైటికి సల్లి,కొత్తనీటిని కడవకు నింపుకుందామనుకుంటే, వూరి వూరి వచ్చేనీళ్లతో మల్లాసెలిమ నిండుతా సేతులు పడిపోయేటియి. పొద్దుపొడిస్తే, ఎండా ఏరూ, సెంద్రుడొస్తే ఎన్నెలా ఏరూ ఇసుకదిన్నెలమింద పొర్లిపొర్లి ఆడుకునేటియి. అట్టాటి ఏరు, మాపెన్నేరు ఏమయింది?

ఏడుపొస్తావుంది.

అప్పుడు ఎన్నెలరాత్రి ఏటిమీద ఎగుర్తా సంతోషంతో ఆడుకొన్నతీతవ[3]

ఇప్పుడు తుప్పలతో నిండిన, ఎండిన ఏటిని సూస్తా " ఏరా... ఏరా... ఏమైపోతివే" అని ఏడుస్తావుండాల నాయాల్నే.

1) కాడికి బహువచనం 2) పనితనం 3) తీతువ పిట్ట